
కథ

# సాయం సంధ్య

భమిడిపాటి రామగోపాలం



**అసలు నిన్న సాయంకాలం బీచ్‌రోడ్డులో మా అబ్బాయి కారు బ్రేక్ డౌన్ అవకపోతే ఈ జ్ఞాప కాలూ, ఈ ఆలోచనలూ నన్ను ఇలా బాధ పెట్టేవే కాదు. మా వాడి కారు ఆగిపోయిన చోట ఉన్న బెంచీ మీద నా వయసు వాళ్లే అయిన నలుగురు వృద్ధులు కనపడే వారు కాదు కదా! వాళ్ల బెంచీకీ, మా అబ్బాయి నన్ను కూర్చోబెట్టిన చోటికి ఎక్కువ దూరం లేదు. అందుచేత సముద్రపు కెరటాల హోరు ఆ కబుర్లని నా దాకా రాకుండా ఆపలేక పోయింది. ఏం కబర్లు, అవీ! వంకాయల ధరలు పెరిగిపోయాయి. అంచేత, ఇల్లాళ్లు గోల పెడుతున్నారు. పెట్రోలు, డీసెల్ ధరలు పెరిగిపోయాయి. అంచేత ఆటోవాళ్లు రేట్లు పెంచేశారు. కందిపప్పు, బియ్యం, రిఫైన్డ్ ఆయిల్ కొంతమందికి తక్కువ ధరలకి ఇచ్చేస్తున్నారట. ఇలా టీవీలో చూసినవి, న్యూస్‌పేపర్లో చదివినవి కలిపి 'ధరల పెరుగుదల' అని ఒక ఉపన్యాసం తయారు చేసేడు ఒకాయన.**

వాటిన్నింటినీ అంత ఇదిగా తీసుకోకూడదు. ఎందుకంటే, పెన్షన్లు కూడా పెరుగుతున్నాయి కదా! ఒక్కొక్క పే రివిజన్ కమీషన్ వచ్చినప్పుడు ఒక్కొక్క రకంగా పెన్షన్లు పెరుగుతున్నాయి. అంతే కాదు, ఇప్పుడు రాబోతున్న కొత్త పే కమీషన్ ఉద్యోగస్థుల జీతాలు ఏకంగా నలభై శాతం పెంచ మంటున్నారు. దానికి అనుగుణంగా పెన్షన్లు కూడా పెరుగుతాయి - అని, ఎవరెవరికి ఎంత పెరుగుతుందో రాసి ఉన్న చిట్టా జేబులోంచి తీసేడు ఇంకొక ఆయన.

ప్రపంచ దేశాల మధ్య అణు ఒప్పందాలు ఏమిటి? వాటిని తూ.చ. తప్పకుండా అమలు పరిస్తే ఎంత ప్రమాదం జరుగుతుంది - అని ఒకాయన తీవ్రమైన చర్చ పెట్టాడు.

ఎన్నో కారణాల వల్ల ద్రవ్యోల్బణం ఏర్పడిందని, దాని వల్ల ధరల పెరుగుదల సామాన్య ప్రజల్ని అట్టే బాధ పడకుండా కాస్తోందని ఇంకొక ఆయన సిద్ధాంతం చేసేడు.

పెద్దపెద్ద దేశాలు, పెద్దపెద్ద యంత్రాలని తయారు చేయకుండా చిన్న చిన్న దేశాలకి ఆ పనులు వదిలేసి ఆలోచనా రంగం మీద మాత్రం పెత్తనం చేస్తున్నాయని అందులో ఒకాయన సోదాహరణంగా ధ్రువీకరించాడు.

మా అబ్బాయి ఏదో వర్క్‌షాపుకి వెళ్లి మెకా



నిక్‌ని తీసుకొచ్చి కారు బాగు చేయించే దాకా ఆ న్యూస్ పేపర్లు అలా వింటూనే ఉన్నాను. ఆ టీవి విశ్లేషణల్ని అలా వింటూనే ఉన్నాను.

ఇంటికి వచ్చాక కూడా ఆ కబుర్లు నా చెవుల్లో తెల్లవార్లూ ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి.

ఎందుకు, ఈ వృద్ధాప్యం? పూర్వం – అంటే దేశానికి స్వాతంత్ర్యం వచ్చేవరకు – దేశంలో వృద్ధులు 10 శాతం నుండి 12 శాతం వరకే ఉండే వారట. ఇప్పుడు వైద్యరంగంలో సాధించిన అభివృద్ధి కారణంగా మరణాలు తగ్గిపోయి వయోవృద్ధుల సంఖ్య బాగా పెరిగిందట. శతాబ్దాల నుండి మనకు తెలియకుండా మనల్ని బాధిస్తున్న వ్యాధులు వాటికవే పేర్లు పెట్టుకుని 20వ శతాబ్దపు రెండవ అర్ధభాగంలో ప్రజల పరిజ్ఞానం లోకి వచ్చాయి. ఈ మధ్యకాలంలో మానవుడికి మృత్యువును తెచ్చిపెట్టే ఈ వ్యాధులన్నిటికీ ఔషధాల ద్వారా చికిత్స జరుగుతోంది. అలా కుదరకపోతే శస్త్రచికిత్స వచ్చిపడింది. అసలు ఇదేమీ కొత్తకాదు. 'అంగవ్రాతమునన్ చికిత్సకుడు దుష్టాంగంబు ఖండించి శేషాంగ శ్రేణికి రక్ష చేసే పద్ధతి పురాణకాలం నాడే ఉంది. ఇదంతా ఇలా ఉండగా శాస్త్రంలోగాని, పూర్వానుభవంలో గాని చెప్పని రకరకాల సిండ్రోములకి నివారణ లొచ్చాయి. మొత్తం మీద ఇవాళ కాళ్ల నొప్పులతోనే కాక, గుండెనొప్పి కారణంగా కూడా ఎవరో గాని చచ్చిపోవడం లేదు. ఇలా వయోవృద్ధులు ఇటు కుటుంబాలకి భోజన భాజనాది ఖర్చుల వల్లను, అటు ప్రభుత్వానికి పెన్షన్ చెల్లింపుల ఖర్చు వల్లను బాధాకరమైన సామాజిక భారంగా స్థిరపడి ఉన్నారు.

అలాగని వీళ్లని తీసిపారేయడానికి కూడా వీల్లేదు. ''ఎముకలు కుళ్లిన, వయసు మళ్లిన సోమరు లారా చావండి'' అని వ్రాసిన శ్రీశ్రీ కూడా సోమరులనే చావమన్నాడు గాని, మిగిలిన వృద్ధులను కాదు. మానసిక అనుభవంతో దేశానికి, ప్రపంచానికి, మానవజాతికి మేలు చేయగల వయోవృద్ధులు అన్ని దేశాల్లోనూ, అన్ని రంగాల్లోనూ ఉన్నారు. యువత, యువశక్తి గొప్పవి – అంటారే కాని, కుటుంబరంగం, బోధనా రంగం, పాలనా రంగం, పరిశోధనా రంగం మొదలైన వాటిలో వయసు ఎంత పడితే ఫలితం అంత

మెండుగా సిద్ధిస్తూ ఉంది మరి.

ఈ ఆలోచనలతో బుర్ర కాటెక్కిపోయింది. నా ప్రక్క మంచం మీద గుర్రు కొడుతూ నిద్రపోయే నా భార్యను కూడా కలత పెట్టినట్టుంది. ఎందుకంటే, సాధారణంగా వెల్లకిలా పడుకుని నిద్రించే నేను ఒకటికి రెండుసార్లు ఈ ప్రక్కకు, ఆ ప్రక్కకు ఒత్తిగిలుతూ పదేసి నిముషాల కొకసారి నీళ్ల త్రాగుతూ ఉంటే గ్లాసుకి చెంబు తగిలి చప్పుడవుతుంది.

ఉన్నట్టుండి ఆవిడ నావేపు తిరిగి తన మంచం మీద కూర్చుంది. ''ఏదో ఆందోళన పడుతున్నట్టుందే?''

''ఆందోళన కాదు, ఆత్మపరిశీలన'' అన్నాను.

''ఇవన్నీ అశాంతి వల్ల, భయం వల్ల వస్తాయని మా నాన్నగారనే వారు'' అని నా మంచం మీది కొచ్చి కూర్చుని ''కళ్లు మూసుకుని పడుకోండి 'ఇంద్రాక్షి' చదువుతాను' అంది.

నాకు నవ్వొచ్చింది. చిన్నపిల్లలు ఏదైనా చెడ్డకల వచ్చినప్పుడో, ఆ సాయంకాలం లోగా జరిగిన ఏదైనా భంగపాటు గుర్తుకొస్తేనో పడుకుని ఉన్న వాళ్లు పడుకున్నట్టు గానే వణుకుకి గురి అవు తారు. అలాంటి వాళ్లని శాంతపరిచే సంస్కృత శ్లోకాల సముదాయాన్ని 'ఇంద్రాక్షి' అనే వారు. అవి నిజానికి శ్లోకాలే అయినా ఆ శ్లోకాల సముదాయానికి మంత్ర స్థాయిని ఇచ్చారు మన పూర్వులు.

''అవును గాని, నీ చిన్నప్పుడు మీకు అమ్మమ్మో, నాయనమ్మో ఉండే వారా?''

''ఉండే వారు. పాపం వాళ్లని కాల్చుకు తినే వాళ్లం. అడ్డమైన అల్లర్లూ చేస్తూను''

''ఎలాంటి అల్లర్లు అవి''

''అవన్నీ ఇప్పుడెందుకులెండి. అర్ధరాత్రి పూట మద్దిల దరువుల్లా?''

''అబ్బా. అది కాదే! ఆ చిన్నతనం నీకింకా జ్ఞాపకముందా?''

''ఎందుకు లేదు? కథలు చెప్పమని అమ్మమ్మని గొలుక్కు తినేసే వాళ్లం. మా కుటుంబం మొత్తం మీద కాశీ మజిలీ కథలు పన్నెండు వాల్యూములు చదివింది ఆవిడొక్కర్తే. మా తాత అవన్నీ అసందర్భపు కథలు అని తోసి పారేసేవాడు. అలా ప్రక్కన పడుకోబెట్టుకునే ఎన్నో పాటలు పాడి నేర్చుకోమనేది. ఇప్పటిలెక్కల్లో అయితే అవి చాలా సిల్లీగా ఉండొచ్చుగాని, అవన్నీ చాలా బాగుండేవి మాకు. శ్రీరాముడికి అరణ్యవాసం తగిలినప్పుడు లక్ష్మణుడు తన పెళ్లాం ఊర్మిళని అయోధ్యలోనే ఉండి పొమ్మన్నాడట. 'పగలంతా అత్తగారికి, మామగారికి సేవలు చేసుకుని కాలక్షేపం చేసేయగలను కాని, రాత్రిళ్లు నువ్వు గుర్తుకొస్తావు కదా?' అంటేనూ – లక్ష్మణుడు ఆవిడకి పన్నెండేళ్ల పాటు నిద్ర వచ్చేటట్లు వరం ఇచ్చాడట. చాలా పెద్ద పాట. 'ఊర్మిళా దేవి నిద్ర' అని మొదలు జ్ఞాపకం ఉంది.

'శ్రీరామ భూపాలుడూ
పట్టాభిషిక్తుడై కొలువుండగా
భరత శత్రుఘ్నులపుడూ
సౌమిత్రి వరస సేవలు సేయగా!''

''మా నాయనమ్మ కూడా ఎనిమిది, పన్నెండు వయసు పిల్లల్ని పోగుచేసి పాటలు పాడించేది. 'సీత సమర్త' 'సుభద్ర సారె' అంటూనూ''.

''సుభద్ర సారె' కూడా మా అమ్మమ్మ చెప్పేది. అర్జునుడు పాండవులందరూ పెట్టుకున్న నియమానికి భంగం చేసినప్పుడు యాత్రలకు వెళ్లేనూ ద్వారకాయాత్రలో తగిలింది సుభద్ర. పెద్ద వాళ్లతో చెప్పడానికి టైములేక అప్పటికప్పుడు ముహూర్తం పెట్టి కృష్ణుడు ఆ పెళ్లి చేసేసి సుభద్రని అతనితో బాటు కట్టుబట్టలతో పంపించేశారట. ఇంద్రప్రస్థ పురానికి వచ్చాక ద్రౌపది ''సారె ఏమీ తెచ్చుకోలేదా?'' అని సుభద్రని అడిగిందట. అప్పుడు అర్జునుడు అలిగినట్లు నటించి పెళ్లాన్ని దెప్పడం, దానికి సుభద్ర జవాబు చెప్పడం – చాలా బాగుంటాయి''

''ఔనౌను చాలా బాగుంటాయి. ఏదీ ఒకసారి అను, చూద్దాం!''

''పున్నమి నాడైనా బూరెలొండుకుని
పురుషుడా రమ్మని పిలిచెరా మీ వాళ్లు?
అమవాస్యనాడైన అట్టొండుకుని
అల్లుడా రమ్మని పిలిచిరా మీ వాళ్లు...?

సుభద్ర జవాబు కూడా దెప్పుడే... ఈయగల చోటనే వియ్యమందారాదా?
పెట్టగలా చోటనే పెళ్లాడా రాదా?

అప్పటితో ఆపేసి ''ఏంటో జ్ఞాపకాలు'' అని నెత్తికొట్టుకుంది మా సావిత్రి.

''మన సంప్రదాయంలో తాతయ్యలు, అమ్మమ్మలు, నాయనమ్మలు మనవళ్లనీ మనవరాళ్లనీ దగ్గర కూర్చోబెట్టుకుని కథలు చెప్పడం. ఆ కథల్లో కొన్ని పిట్టకథలు, ఛలోక్తులు చెప్పి వాళ్లని ఉల్లాస పరచడం ఉండేది. ఆ కథల్లో మన దేశానికి సంబంధించినవే కాక, సింద్‌బాద్ కథలు. రాబిన్‌హుడ్ – ప్రిన్స్ అండ్ పాపర్ – ఇలాంటి పడమటి దేశాల కథలు కూడా ఉండేవి. వాటిని వినడం వల్ల పిల్లల మనసులో రకరకాల సంస్కృతుల జ్ఞానం నాటుకుంది.

ఇప్పుడు ఒక తాత, ఒక మనుమడు కలవడమే అపురూపం. కలిసినా తాత అంటే ముసిలి కంపు. చాలామంది తాతలు వృద్ధాశ్రమాలకి చేరిపోతున్నారు. కొడుకులకీ, కూతుళ్లకీ గొప్ప గొప్ప విద్యలు చెప్పించి వాళ్లు వృద్ధాప్యంలో తమకి అండగా ఉంటారని ఆశించే ముసిలాళ్లలో చాలా మంది ఆశా భంగం చెందుతున్నారు. చదువుతో, జ్ఞానంతో ధగధగలాడే మధ్యతరం వాళ్లు ఎక్కు వెక్కువ సంపాదన కోసం విదేశాలకీ వెళ్లిపోతున్నారు. కొన్ని సందర్భాల్లో ముసిలి తల్లి దండ్రులకి డాలర్లు, పౌండ్లు, దీనార్లు లాంటి డబ్బు వచ్చి పడుతుంది. కాని, ముసిలాళ్లకి ఏదైనా జబ్బువస్తే స్వయంగా వచ్చి ఊరడించి చికిత్సలు చేయించే అవకాశాలు ఉండడం లేదు. ఒక్కొక్కప్పుడు తండ్రో తల్లో చచ్చిపోతే తలకొరివి పెట్టడానికి కూడా కొడుకులకి సెలవులు దొరకడం లేదు.


''ఊరుకోండి.. అర్ధరాత్రి పూట ఏమిటి ఈ అశుభం మాటలు. అన్నీ మీరనుకున్నంత చెడ్డగా లేవు. మాటవరసకి మన మనవడు గార్గేయ – నేను ఇండియా వచ్చేసి సంస్కృతం, వేదం నేర్చుకుని ఇక్కడే సెటిల్ అయిపోతానంటున్నాడు కదా! మీ ఫ్రెండు ఆంజనేయులు గారి మనవరాలు అన్ని రకాల పూజా విధానాల్నీ నేర్చుకుని అన్నిటికీ టేపు రికార్డర్లే గతి అనుకుంటున్న అమెరికాలో గొప్ప పురోహితురాలుగా ఉందా, లేదా? మొన్నామధ్య ఆ పిల్ల మన ఇంటికొచ్చి సత్యనారాయణ వ్రతం నిష్ఠగా, తీవిగా చేయించిందా, లేదా?''

సావిత్రి మాటలు వింటే ఏదో కొంత ధైర్యం కలిగింది. వృద్ధాప్యం పూర్వకాలంలో ఉండినంత అమాయకపు అందంతో కాకపోయినా గడుసు తనపు మనో నిబ్బరంతో ఇప్పటికీ ఉందేమో – అనిపించింది. అయితే అప్పటి నేవళీకం మాత్రం ఇంక తిరిగిరాదు.

చాలా రాత్రి అయిపోయింది. కాని, ఇంకా చాలా రాత్రి మిగిలిపోయి ఉంది.

*

చిరునామా:
**భమిడిపాటి రామగోపాలం**
**అర్జున్ అపార్ట్‌మెంట్స్, కృష్ణా కాలేజీ వద్ద**
**విశాఖపట్నం – 530 022**



## పెళ్లి ఆలోచనలో భావన?

పలు తెలుగు, తమిళ,మళయాల చిత్రాలలో నటించిన భావన పెళ్లి చేసుకునే ఆలోచనలో ఉంది. మళయాళంలో మోహన్‌లాల్ సరసన నటించిన భావనకు కోలీవుడ్‌లో పెద్దగా అవకాశాలు లేకపోవడంతో ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. భావన గురించి ఓ తమిళ దర్శకుడు మాట్లాడుతూ, 'ఆమెకు ఎలా సిగ్గు పడాలో తెలియదు. అసలు సిగ్గంటే అంటే ఏమిటో కూడా ఆమెకు తెలియదు' అని అన్నారు. కోలీవుడ్‌లో దాదాపు అందరి దర్శకుల అభిప్రాయం ఇదే కావడంతో ఆమెకు అవకాశాలు లేకుండా పోయాయని అంటున్నారు. ఖాళీగా కూర్చోవడం ఇష్టం లేక పెళ్లి చేసుకోవాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.